# వేట

డి. కామేశ్వరి

దట్టమైన దండకారణ్యం మధ్య రోజూ చీకట్లో నిశ్శబ్దంగా నిద్రపోయే "మల్కానగిరి" ఫారెస్ట్ గెస్ట్ హౌస్ ఆరోజు కలకలలాడిపోతూంది. బయట వరండాలో పెట్రోమాక్స్ లైట్ దేదీప్యమానంగా వెలిగిపోతూంది. బయట రెండు జీపులు నిలబడి వున్నాయి. నలుగురు ఫారెస్ట్ గార్డులు బయట సాయుధులై నిలబడ్డారు. నలుగురు ఫారెస్ట్ రేంజర్లు ఒక చోట నిలబడి కబుర్లు చెప్పుకుంటున్నారు. ఇద్దరు డి.ఎఫ్.వో.లు బయట వరండాలో కుర్చీల్లో కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. వెనక కిచెన్‌లో కోళ్ళ పీకలు తెగిపోతున్నాయి. మసాలా వాసనలు ఘాటుగా పైన కూర్చున్న వాళ్ళకి నోరూరిస్తున్నాయి. ఆ వాసనలు పసిగట్టి నాలుగైదు కుక్కలు ఆరాటంగా తోకాడించుకుంటూ తిరుగుతున్నాయి.


ఎప్పుడైనా ఫారెస్ట్ ఆఫీసర్లు టూర్లమీద వచ్చినపుడు తప్ప మిగతా టైములో ఆ డాక్ బంగళా నిశ్శబ్దంగా నిద్రపోతున్న ట్టుటుంది. అడవి మధ్య వుందేమో మిగతా డిపార్టుమెంటులవారు ఎంతో అవసరం అయితే తప్ప అక్కడ విడిది చేయరు. ఫారెస్ట్ డిపార్టుమెంటు వారైనా షికారీ సరదాకి వచ్చేవారే అక్కడ కాంప్ చేస్తూంటారు. శీతాకాలం విపరీతమైన చలి. వర్షాకాలం కుండపోతగా వర్షం. ఎండాకాలం మాత్రం చాలా హాయిగా వుంటుందేమో అప్పుడు మాత్రం ఎక్కువమంది ఆఫీసర్లు టూర్ మీద వస్తుంటారు.

ఈ రోజు ఈ ఆర్భాటానికి హడావిడికి కారణం కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్‌గారు టూరు వేంచేస్తున్నారు. ఆయనగారి టూర్ ప్రోగ్రాం అందుకోగానే ఆ జిల్లా ఫారెస్ట్ ఆఫీసరుగారు కంట్రాక్టరుగారితో చెప్పి చెప్పనట్లు అధికారిగారి ఆగమన వార్త చెప్పారు. ఆ మాత్రం చెపితే కంట్రాక్టరు సకలమైన ఏర్పాటులు చేస్తాడని ఆయనకి తెలుసు — లేకపోతే గవర్నమెంటు యిచ్చే జీతాలతో వారికి రాజలాంఛనాలు ఏర్పాటుచెయ్యాలంటే మాటలు గాదని తెలుసు.

ఆ కంట్రాక్టరుకీ ఇది కొత్తకాదు. ఏ ఫారెస్ట్ ఆఫీసరు టూర్ వచ్చినా వారి వారి తాహతులను బట్టి వారికి కావల్సిన ఏర్పాటులు చెయ్యడం తన డ్యూటీలో ఒక భాగంలా చేసేస్తూంటాడు, అందులో ఈ రోజు వస్తున్నది కన్సర్వేటర్‌గారు— అదీ కొత్త కన్సర్వేటర్ — ఈ జిల్లాకి రావడం ప్రథమం. అంచేత ఏర్పాటులు చాలా ఘనంగా చేశాడు. అరడజను కోళ్ళు, రెండు మేకలు తెచ్చి పెరట్లో కట్టేశాడు. ఫారెన్ విస్కీ బుడ్లు ఏర్పాట్లుఅయ్యాయి. ఆయనేకాక యిద్దరు మిత్రులొస్తున్నారని మూడు మంచాలు వేయించి, డన్‌లప్ పరుపులు వేయించాడు. కొత్త దుప్పట్లు, తువాళ్ళు, చాకింటి కర్టెన్లు, స్పెషల్ సబ్బులు, వేడినీళ్ళు చన్నీళ్ళు అన్నీ పకడ్‌బందీగా ఏర్పాటయాయి— కన్సర్వేటర్‌గార్ని ప్రసన్నుడిగా చేసుకోవల్సిన అవసరం చాలా వుంది. ఆ ఏరియాలో అడవిలో పిచ్చి మొక్కలు, పనికిరాని వృక్షాలు కొట్టించి చదునుచేసి టేకు, దేవదారు, కలప మొదలైన మేలు జాతి చెట్లు నాటాల్సిన పని సాలుకి మూడు లక్షల రూపాయల కంట్రాక్టు వుంది. ఆ జిల్లా డి. ఎఫ్. ఓ. అతనికి కొరుకుడు పడడం లేదు. పెద్ద పిట్టనే పడితే యింక ఆ డి.ఎఫ్.ఓ.ని లెక్కచెయ్య నక్కరలేదు. ఆ మూడు లక్షల ముందు ఈనాటి ఖర్చు కంట్రాక్టరుకి ఓ లెక్కకాదు.

ఆ కంట్రాక్టరు పేరు యస్. పట్నాయక్. పూర్వాశ్రమంలో తెలుగువాడైనా తరతరాలుగా ఒరిస్సాలో స్థిరపడి ఒరియావాడిగా మారిపోయాడు. ముందు ఫారెస్ట్ గార్డుగా చేరినపుడు సుబ్బయ్యగా వుండి, రేంజరయ్యాక సుబ్బారాయుడిగా మారి రేంజర్‌గా వున్నప్పుడు అందిన మేరకు నాలుగు రాళ్ళు పోగుచేసుకుని ఉద్యోగం మాని చిన్న చిన్న ఫారెస్ట్ కంట్రాక్టులతో మొదలుపెట్టి పదేళ్ళలో ఆ ప్రాంతాల పెద్ద ఫారెస్ట్ కంట్రాక్టరయి సుబ్బారావు పట్నాయక్ అల్లా ఎస్. పట్నాయక్‌గా మిగిలాడు — తెలుగు ఆఫీసర్లతో తెలుగువాడినని, ఒరియా వాళ్ళతో ఒరియావాడినని చెపుతూ ఎవరికి ఏది ముట్టచెప్పి ఏది రాబట్టాలా వగైరా కంట్రాక్టులోని మెలకువలు నేర్చుకుని తెలివిమీరిపోయాడు — ఏ ఆఫీసరు టూరు మీద వచ్చినా అక్కడ ప్రత్యక్షమయి వారి అవసరాలు వెయ్యి కళ్ళతో కనిపెట్టి అందరికీ ప్రీతిపాత్రుడయ్యాడు.

ఈ కొత్త కన్సర్వేటర్ రమాకాంత్ మిశ్రా షోకిల్లా పురుషుడు - స్ఫురద్రూపి, సరసుడు అంటే —మదిరతో పాటు మదవతిలేనిదే వుండలేడని, ఎప్పుడూ ఫ్రెండ్సు, క్లబ్బులు, పార్టీలు షికారీలు — అంటూ జల్సాగా కాలక్షేపం చేసేరకం అని — బీదరికంలో పుట్టి, ఆ కారణంగా చదువుకోసం చిన్నతనంలోనే డబ్బుకోసం ఓ కోతిని పెండ్లాడి ఇల్లరికం వెళ్ళి, మామగారి డబ్బుతో చదువుకుని పైకి వచ్చి, ఇంట్లో కోతి భార్యతో, అందంలేకపోయినా చదువు సంస్కారం లేని పల్లెటూరి గయ్యాళి భార్యని భరించలేక. భరించక చేసేదేంలేక ఆయన యింట్లో దొరకని అందాన్ని, ఆనందాన్ని బయట అనుభవిస్తాడని. ఏ డబ్బు కారణంగా అతను జీవితంలో నష్టపోయాడో ఆ డబ్బు మీద కసితో రెండు చేతులా అందిన చోటల్లా పుచ్చుకుని జీవితాన్ని అనుభవించి ఆనందించడమే ధ్యేయంగా పెట్టుకుని యింట్లో పెళ్ళాంనించి తప్పించుకుని ఎప్పుడూ టూర్లు. లేక ఫ్రెండ్స్, క్లబ్బులలో కాలక్షేపం చేస్తాడని చాలా వివరాలే సేకరించాడు పట్నాయక్. అంతేకాక తన రూపంతో, మాటలతో ఏ స్త్రీనైనా ఆకర్షిస్తాడని, ఏం చేస్తాడో. ఎలాచేస్తాడో ఎలాంటి ఆడదాన్నైనా బుట్టలో పడేట్టు



ఇంద్రజాలం చేస్తాడు. అతని పేకాటం గురించి కిందామీదా అధికారులకీ, మిత్రులకీ అందరికీ తెలుసు. అతనిలో దుర్గుణా లన్నీ అతని మాట నేర్పరితనం, అతని పెర్సనాలిటీ, అతని స్నేహ ప్రియత్వం, చాటున మరుగు పడిపోతాయి. అతనెక్కడ వుంటే అక్కడ ఉల్లాసం, ఉత్సాహం చిందులువేస్తుందని – పది మందిని చుట్టూ వేసుకుని వుంటాడనీ తెలుసుకున్నాడు. అతనికి వేట హాబీ. వేటమీద మనసుపోయి నపుడల్లా తన జ్యూరిస్‌డిక్షన్‌లో ఏ అడవిలోనో టూర్ ప్రోగ్రాం వేసుకుంటాడు. అత నిప్పటికి నాలుగు పులుల్ని చంపాడు. మిత్రులందరికీ పులి చర్మాలు, గోళ్ళు, ఖురలు, దుప్పి కొమ్ములు, జింక చర్మం వగైరాలు ప్రెజెంట్ చేస్తుంటాడు. ఇతర డిపార్ట్‌మెంటు ఆఫీసర్లెవరైనా వేట చూడాలని వుంటే చాలు రమాకాంత్‌ని అడిగితే చాలు మహదానందంగా వెంట బెట్టుకువెళ్ళి సకలమైన ఏర్పాట్లు జరిపిస్తాడు.

ఈ సమాచారం సేకరించి దానికి తగ్గ విధంగానే అన్ని ఏర్పాటులు చేశాడు పట్నాయక్. దొరవారు టూర్ ప్రోగ్రాం ప్రకారం జయపురంనించి సాయంత్రం బయలుదేరి ఏడు గంటలకి చేరాలి.

* * *

బయట జీపు హారన్ వినగానే వాచ్‌మన్ పరిగెత్తి గేటు తీశాడు – గార్డులు ఎటెన్షన్‌లో నిలబడి సెల్యూట్ చేశారు. రేంజర్లు వినయంగా నమస్కారాలు చేశారు. డి. ఎఫ్. వో.లు మెట్లు దిగి ముందుకు వచ్చి నిలబడ్డారు – వంటలని పర్యవేక్షిస్తున్న కంట్రాక్టరు పరుగున వడి వరండాలోకి వచ్చాడు.

కన్సర్వేటర్ గారు, మిత్రులిద్దరూ జీపు దిగారు. మరో జీపునించి వారితోపాటు టూర్ చేస్తున్న మరిద్దరు డి. ఎఫ్. వో.లు దిగారు. అందరి నమస్కారాలు అందుకుని హుందాగా తల పంకించి మిత్రులతో వరండాలోకి నడచి కుర్చీలలో ఆసీను లయ్యారు. ఆఫీసర్లని పరిచయం చేసుకుని లాంఛనంగా పది నిమిషాలు ఆఫీసు విషయాలు డిస్కస్ చేసి "ఆల్‌రైట్. యు విల్ మీట్ ఎగైన్. టుమారో మార్నింగ్ ఎట్ టెన్" అని లేచి లోపలికి వెళ్ళిపోయాడు. నాల్గు గంటలనించి పడిగాపులు పడివున్న డి. ఎఫ్. వో.లు మొహాలు చూసుకున్నారు. వచ్చినట్లు మళ్ళీ రావాలని మొహాలు చూసుకుని మెట్లు దిగారు. అక్కడ క్యాంప్ చెయ్యడానికి వున్నది ఒకటే డాక్ బంగళా. ఏ కోరాపుట్టో, జయపూరో వెళ్ళి రాత్రికి వుండి మళ్ళీ రావాలి– ఈ కన్సర్వేటర్ గారు టూర్ రెండు రోజుల్లో పనిరెండు గంటలు, షికార్ రెండు రోజులు చేస్తారని వినే వున్నారు. కనక ఏం చెయ్యలేక మనసులో తిట్టుకుంటూ వెళ్ళారు.

"తమరు కాస్త 'టీ' తీసుకుంటారా?" కంట్రాక్టరు వినయంగా అడిగాడు రమాకాంత్ వాచ్‌చూసి "ఏ వద్దు, ఏడున్న రయింది. ముందు స్నానంచేసి...... తరువాత...."

"ఆ... ఆ. ఆ ఏర్పాటులు చూశానండి. గదిలో వేడినీళ్ళు సిద్ధంగా వున్నాయి. డిన్నర్ ఎన్నింటికి సార్".

"పది గంటలకి. ఆ... మీరు?" ఎవరన్నట్లు చూశారు.

"చిత్తం. నాపేరు పట్నాయక్ అండి. కంట్రాక్టు పనులు చేస్తూంటాను" వినయంగా చేతులు నలుపుకుంటూ అన్నాడు.

"ఐసీ!" అన్నాడు రమాకాంత్. కంట్రాక్టరు అనగానే అతనికి అంతా అర్థం అయింది "ఆ....రాత్రి షికారీకి అన్ని ఏర్పాటులు జరిగాయా?"

"ఎస్ సార్."


"మాటు సిద్ధం చేశారా? మాతో రావాల్సినవాళ్ళు జీపు, ఫ్లడ్‌లైట్స్, గన్నర్."

"చిత్తం అంతా రెడీ సార్."

"సరే డిన్నరయ్యాక పదిన్నర పదకొండుకి బయలుదేరుతాం" అంటూ రమాకాంత్ గదిలోకి వెళ్ళాడు.

మిత్రులు ముగ్గురూ స్నానాలుచేసి వచ్చేసరికి బయట వరండాలో పెట్రోమాక్స్ లైటు చుట్టూ కుర్చీలు గుండ్రబల్ల చుట్టూ వేయించి బాటిల్సు, ఐస్ ఫ్లాస్కు, గ్లాసులు, నంజుకోడానికి వేయించిన జీడిపప్పు, పొటేటో చిప్స్, వేరుశనగ పప్పులు, సిగరెట్ పెట్టెలు, పేక దస్తాలు ఏర్పాటు

ఒక పట్నంలో హరికథాపితామహ ఆదిభట్ల నారాయణదాసు రాత్రి పదిన్నరకు, త్రాగి తూలుతూ, వేదికమీదికి వచ్చి "ఏరా! మీకు హరికథ కావాలా? గిరికథ కావాలా?" అని అడిగాడు ఆయన. అంత్యంగా అర్థచైతన్యావస్థలో వచ్చినందుకు కినిసిన ఒక పెంకెఘటం "గిరి కథ కావాలి" అని అరిచాడు. అప్పుడు దాసుగారు హిమవంతుడు, తన కుమార్తె పార్వతిని పరమేశ్వరునికిచ్చి వివాహం చేసిన కథ "పార్వతీ పరిణయం" ఆశువుగా చెప్పి, శ్రోతలను ఆశ్చర్యానందాలలో ఓలలాడించాడు.



చేశాడు పట్నాయక్. ఏర్పాటు చూసి సంతసించి మెచ్చుకోలుగా తల ఊపి "వెల్.... కమాన్ ఫ్రెండ్స్ పది గంటల వరకు యీ అడవిలో మనకిదే కాలక్షేపం' అంటూ బాటిల్ అందుకున్నాడు రమాకాంత్.

'రమ్మీ వేద్దామా.' అంటూ పేక తెరిచాడు అభిరామ్ పండా. అభిరామ్ పండా ఐ. ఎ. ఎస్, సెక్రటరీగా ఫైనాన్స్‌లో వున్నాడు.

'మరొకరుంటే బ్రిడ్జి ఆడుకునే వాళ్ళం. ఏరి మీ డి.ఎఫ్.వో.లు- అంతా వెళ్ళిపోయారా?' అన్నాడు విభీషణ్ మహంతి - అతను నేషనల్ హైవేస్‌లో చీఫ్ యింజనీరు, ముగ్గురూ క్లబ్ మిత్రులు.

"వాళ్ళెందుకు? నవ్వడానికికూడా భయపడి బిగపట్టుకుని బిక్కచచ్చి కూర్చుంటారు. వాళ్ళతో మనకి ఫ్రీగా వుండదు" అన్నాడు రమాకాంత్ గ్లాస్‌లో ఐస్ ముక్కలు వేస్తూ.

రాత్రి పదివరకూ పేకాడుతూ, తాగుతూ రమాకాంత్ యిదివరలో తన వేట విశేషాలు చెప్తూ. కబుర్లతో. నవ్వులతో హోరెత్తించారు ముగ్గురూ ఆ అడవి అంతా.

పది గంటలకే డిన్నర్‌కి లేచారంతా. మటన్. చికెన్. పులావులతో పాటు సాంబార్. రసం, కొబ్బరి పచ్చడి రకరకాలతో టేబిల్ నింపేశాడు పట్నాయక్.

"అరే తెలుగు వంటలు చేయించావే 'కంసమా' (ఇనస్పెక్షన్ బంగళాల్లో వంటవాడు) తెలుగువాడా?" రుచి చూస్తూ మెచ్చుకుంటూ అన్నాడు రమాకాంత్.

"కాదండి. మీకు తెలుగు వంటలు యిష్టం అని విని స్పెషల్‌గా మా ఆడవాళ్ళతో చేయించాను" కంట్రాక్టరు వినయంగా అన్నాడు.

"ఓ. బిస్ట్!" రేగిన మత్తులో తేలిపోతున్న అతనికి అంతకంటె వివరాలు అడిగే వినే ఓపికలేదు. అంతా సుష్టుగా భోం చేశారు. బాగా భోంచేసి వచ్చేసరికి ఆరుబయట వెన్నెల్లో పక్కలు వేయించి పాన్ సిగరెట్లు అరేంజి చేశాడు పట్నాయక్.

"వాహ్ - బలే ఎరేంజిమెంట్సోయ్, దమ్మిడి ఖర్చులేకుండా పెళ్ళివారి మర్యాదలు జరిపిస్తున్నావు మా వాడిచేత" అన్నాడు అభిరామ్. మరేమిటనుకున్నావ్ అన్నట్టు గర్వంగా చూశాడు రమాకాంత్.

వెన్నెల పుష్పవృష్టిలా కురుస్తోంది.



"అరినీలాలక చూడనొప్పెసగె బ్రత్యాలీఢ పాదంబుతో........

చిత్రం : మారేమండ శ్రీనివాసరావు, గుంటూరు.

ఎక్కడివో అడవిపూల వాసన, డాక్ బంగళాలో మల్లెలు, నైట్‌క్వీన్ పరిమళాలు పిల్ల తెమ్మెరతో పాటు కదిలి వస్తోంది. ఎక్కడో దూరంగా కొండ మీదనించి దుమికే నీటిధార శబ్దం- వాతావరణం ఆహ్లాదకరంగా వుంది.

"వండర్‌ఫుల్- యిలాంటిచోట వలచి వలపించే ప్రియురాలితో విహరిస్తే యింకెంత మజాగా వుంటుంది. ఈ వెన్నెల. ఈ చల్లగాలి. ఈ పరిమళాలు, ఈ ఏకాంతం, ఓహ్ హనీమూన్‌కి సరి అయిన చోటు కదూ-" రమాకాంత్ అసలే సరసుడు. దానికితోడు పిసరంత కవి హృదయం వుందేమో, పుచ్చుకున్న పానీయంతోపాటు పరిసరాలు మత్తునివ్వగా కలల్లో తేలిపోతున్నట్లున్నాడు.

"చంపావు ఈ అడవిలో ప్రేయసిలను కూడా ఎక్కడ సప్లయి చేస్తారు ఫూర్ ఫెలోస్ ఇప్పుడు వాళ్ళనిబ్బంది పెట్టకు" రమాకాంత్ వీక్ నెస్‌లు తెల్సిన విభీషణ్ చమత్కారంగా అన్నాడు.

'మన కాంత్ తలుచుకోవాలేగాని కారడివిలో కూడా కాంతల్ని సంపాదిస్తాడు.' జోక్ చేశాడు అభిరామ్.

ఆ మాట నిజం అన్నట్టు హఠాత్తుగా రమాకాంత్ నిటారుగా కుర్చీలో కూర్చుని 'అరే' అన్నాడు ఆశ్చర్యంగా. అతను చూస్తున్నవైపు తక్కిన యిద్దరూ కూడా ఆశ్చర్యంగా చూశారు.

డాక్ బంగళాకి ఎదురుగా కాస్త దూరంలో ఓ టెంట్ వుంది. టెంటు బయట పండువెన్నెలలో. మిల మిల మెరిసే తెల్లచీర. బారెడు నల్లటి జడ-జడలో విచ్చిన తెల్లని పూలు-యిటు అటు పచార్లు చేస్తున్న స్త్రీమూర్తిని చూసి ముగురూ ఒక్కక్షణం ఆశ్చర్యంగా అటే చూస్తూండిపోయారు.

"ఎవరీమె- కామినీయా, వనసుందరా, గంధర్వకన్యా- కలా, నిజమా, భ్రమా" రమాకాంత్ కళ్ళు చికిలించి మెలకువ తెచ్చుకుని మరోసారి చూశాడు. తక్కిన యిద్దరికీ అదే అనుమానం వచ్చింది.

"ఈ అడవిలో రాత్రి.... ఎవరీమె? యిక్కడెందుకు వుంది? చాలా ఆశ్చర్యంగా వుందే. ఆ టెంటు యిందాకా మనం వచ్చినప్పుడు వుందా?" దెయ్యాల కథలు గుర్తువచ్చి అనుమానంగా అన్నాడు రమాకాంత్.

"ఏమో- మనం సరీగ్గా చూసి వుండం, చీకట్లో వచ్చాంగదా" మహంతి అన్నాడు.

"అడిగేస్తే పోతుందిగా-" అన్నాడు పండా. వెనకాతల కిచెన్‌లో అంతా భోజనం చేస్తున్నారు. పళ్ళాలు. గ్లాసుల చప్పుడు. మాటలు వినిపిస్తున్నాయి. గేటు దగ్గర ఓ గార్డు మాత్రం కనిపించాడు. రమాకాంత్ గార్డుని పిలిచాడు. టెంటు వైపు చూపించి "అక్కడ .... ఎవరు? ....ఆమె ఎవరు?" అనడిగాడు. వాడు జవాబిచ్చేలోగా వెనకనించి పట్నాయక్ భోంచేసి గొంతు సవరించుకుంటూ వచ్చాడు. రమాకాంత్ ప్రశ్నవిని అటను టెంట్‌వైపు ఒకసారి చూసి "హి..హి..మా ఫేమిలీ లెండి" అన్నాడు నసిగి. రమాకాంత్ ఆశ్చర్యపోయాడు. "ఏమిటి ఈ అడవిలో టెంటులో ఫేమిలీతో వుంటున్నారా మీరు?" అడిగాడు. కంట్రాక్టరు వినయంగా చేతులు నలుపుకుంటూ. "అబ్బే లేదండి, యిటు ప్రాంతాల ఎప్పుడూ చూడలేదంటే, ఈ అడవి అది చూడాలని సరదా పడుతూంటే నాతో తీసుకు వచ్చాను" ఏదో అపరాధం చేసినట్లు సంజాయిషీ యిస్తున్నట్లున్నాడు.

"అహ... మరి టెంటులో వున్నారు భయంలేదా?"

"మరిక్కడ వసతి ఏముందండి. మీరు రాకపూర్వం గది ఖాళీ వుందని డాక్ బంగళాలో వున్నాం - మీరొస్తున్నారని ఖాళీచేసి టెంటు వేయించాను. రెండు రోజుల్లో వెళ్ళిపోతాం" వినయంగా అన్నాడు. రమాకాంత్ ఉత్సాహం ఎందుకో కరిగిపోయింది. ఏదో వింటాననుకున్నది యింత చప్పగా కంట్రాక్టరు భార్యగా తేలిపోగానే ఏదో పొంగు అణిగిపోయినట్టయింది. కంట్రాక్టరు వెళ్ళగానే మరోసారి అటు చూశాడు. మంచి విగ్రహం, యింత దూరంనించే మెరిసేరంగు; చీర జాకెట్టుకి మధ్య కన్పిస్తున్నట్లున్న నడుం రంగు.... యింతఅందం, ఈ నల్ల మొద్దు స్వంతమా వీడికి.... ఈ ఎద్దుకి.... అంత అందమైన భార్య.......' మింగుడుపడని నిజంలా అన్పించింది.



"నో యూస్ మై బాయ్ - ఫేమిలీ లేడీ - తన్నగలదు పిచ్చివేషాలు వేస్తే" మహంతి రమాకాంత్ మొహంలో భావం చదివినట్లున్నాడు.

"ఛా.... ఛా- అదేంకాదు, ఈ అడవి మధ్యలో హఠాత్తుగా స్త్రీ కనిపిస్తే కుతూహలం అన్పించింది. అంతే" అన్నాడు. రమాకాంత్ నవ్వి- అన్నంత తేలిగ్గా అతని మనసుని నమ్మించలేకపోయాడు.

* * *

పదకొండు గంటలకి అంతా జీపు ఎక్కారు. జీపుకి ఇటు అటు రెండు ఫ్లడ్ లైట్స్ కట్టారు. మహంతి డ్రైవ్‌చేస్తుంటే రమాకాంత్, పండా పక్కన కూర్చున్నారు, రమాకాంత్ గన్ పట్టుకుని గురిపెట్టుకుని సిద్ధంగా ఉన్నాడు. తోవలో ఏదన్నా కనిపించదా అన్న ఆశతో వెనకాతల ఒక గన్నర్, కంట్రాక్టర్, ఒక గార్డు కూచున్నారు. రెండు పెద్ద ఫ్లాస్కులనిండా టీ-బిస్కట్ల పేకట్లు, సిగరెట్ పెట్టెలు, వాటర్ బాటిల్, ఒక జంపుకానా, బాటరీ లైట్లు వగైరా సరంజామా సిద్ధంచేసుకున్నారు.

"ఎంత దూరం వెళ్ళాలి మనం" రమాకాంత్ కంట్రాక్టర్ని అడిగాడు.

"ఇక్కడనించి ఆరు మైళ్ళు ఈ రోడ్డు. ఆ తరువాత అడవిలోకి కచ్చా రోడ్డులో నాలుగు మైళ్ళు వెళ్ళాక జీపింక వెళ్ళదు సార్, అక్కడనించి మూడు ఫర్లాంగులు నడిచి లోపలికి వెడితే అక్కడ మాటు వేయించి రెడీ చేశాను సార్...." పట్నాయక్ తోవ చూపిస్తుండగా జీపు కదిలింది. కంకర రోడ్డు దిగగానే ఫ్లడ్ లైట్ల వెలుగుకి జీపు చప్పుడికి భయపడి నాలుగైదు కుందేళ్ళు గాభరాగా పరిగెత్తి మాయమయ్యాయి. రెండు నక్కలు తలలెత్తి చూశాయి. పోను పోను అడవి దట్టమవుతున్నకొద్దీ చెట్ల కొమ్మలు తలలకి తగులుతున్నట్లనిపించింది. నిద్రపోతున్న పక్షులు ఆ హడావిడికి లేచి ఒక్కుమ్మ

డిగా అరవసాగాయి. అడవి అంతా హఠాత్తుగా మేల్కొన్నట్లు అయింది. మనిషి వెళ్ళగలిగేపాటి ఆ బాటలో గతుకులలో జీపు ప్రయాణం చేస్తూంది. ఎత్తెత్తి కుదేస్తూంది. "ఓ దుమ్మరగుం ఢయినా తగలలేదు తోవలో ఈవాళ" అన్నాడు నిరుత్సాహంగా రమాకాంత్. ఓ కుందేల్ని కొట్టబోతూంటే "ప్స్.. ప్స్... వద్దు వద్దు చిన్నముంక తెల్లగా ముద్దు వస్తూంది పాపం చంపకు" అన్నాడు అభిరామ్. మొదటిసారి ఈ షికారీకి రావడ మేమో ఆ యిద్దరికీ అంతా ఆశ్చర్యంగా ఆనందంగా వుంది. ఆ గతుకుల సన్నని బాటకూడా అంతంఅయి నాలుగు వక్కలా మహా వృక్షాలతో నడవడానికి కూడా తోవ లేని చోటు వచ్చేసరికి జీపు ఆపేశారు. అంతా జీపు దిగారు. గన్నర్ బ్యాటరీ లైటు, గన్‌తో ముందు నడుస్తూండగా గార్డ్ సామానులన్నీ మోస్తూండగా తలా కళ్ళు తలో బ్యాటరీలైట్ పట్టుకుని చెట్ల కొమ్మలని తప్పించుకుంటూ కింద చూసుకుంటూ నడవసాగారు, పైన పండు వెన్నెల కురుస్తున్న ఆ దట్టమైన చెట్లని చీల్చుకుని వెన్నెల రాలేకపోవ డంతో అంతా చీకటిగా వుంది. కీచురాళ్ళ రొద, నడుస్తుంటే కింద ఎండుటాకుల గలగలలు - ఆ వాతావరణం చూస్తుంటే పండాకి, మహంత్‌కి భయంకరంగా ఏదో ఎడ్వంచర్‌లా వుంది. వీళ్ళ అడుగుల చప్పుడికి నిద్రపోతున్న ఓ లేడి లేచి చెంగున దుమికి పొదలోకి పారిపోయింది. కుందేళ్ళు గాభరాపడి పరిగెత్తాయి. మూడు ఫర్లాంగులు దట్టమైన అడవి మధ్య నడిచాక పట్నాయక్ ముందే ఏర్పాటు చేసిన మంచె దగ్గిరకి చేరారు. పెద్ద పెద్ద కొమ్మలతో వున్న మహావృక్షం మధ్య కొమ్మల మీద వెదురు కర్రలతో, పెద్ద కొమ్మలతో మంచె తయారుచేశారు. పైన గడ్డి పరిచారు. ఆరుగురు శుభ్రంగా కూర్చో వచ్చు. ముందే పంపిన ఓ గార్డు మాటు కట్టడానికి తీసుకొచ్చిన మేకపోతుని పెట్టుకుని అక్కడ కూర్చుని వున్నాడు కంట్రాక్టరు చకచక గడ్డిమీద జంబుకానా పరిచి సామాగ్రి చేరేశాడు. అంతా ఒకరి నొకరు చేయి అందించుకుని పైకి ఎక్కారు. కింద కొంత దూరంలో ఓ చెట్టుకి మేకపోతుని కట్టారు. రమాకాంత్ ఒక గన్, గన్నర్



ఆది వరాహ మూర్తి
(బేలూరు కుడ్యశిల్పం)
ఫొటో : యమ్. వి. సుబ్బారావు. మద్దిపాడు

ఒక గన్, గార్డు మరో గన్ను పట్టుకుని ముగ్గురూ మూడు దిక్కులకి మొహం పెట్టుకుని రెడీగా పొజిషన్ చూసుకుని కూర్చున్నారు.

పులి వేటకి సరదాతోపాటు ధైర్య సాహసాలేకాక, ఓర్పు చాలా అవసరం. అలా చీకట్లో - విసుగు విరామం లేకుండా కళ్ళు విప్పుకుని రాత్రంతా పులికోసం ఎదురు చూడడానికి చాలా ప్రాక్టీసే వుండాలి-ఒకోసారి అంతలా కాచుకున్నా పులి కనపడకపోవచ్చు - పులి కన్పించినా గురి తగలకపోవచ్చు- గుండు తగిలినా సరియైనచోట తగలకి పులి పారిపో వచ్చు. వరసగా రెండు మూడు రోజులు ఓపిగ్గా ఎదురు చూడాల్సి రావచ్చు- అంచేత పులి వేటకి వెళ్ళినప్పుడల్లా పులి దొరుకుతుందని లేదు. అంత మాత్రంచేత నిస్పృహ పడి లాభంలేదని రమాకాంత్ మిత్రులిద్దరికీ ముందే చెప్పాడు. రమాకాంత్ ఏభై సార్లయినా వేటకి వెళ్ళి వుంటాడు. అన్ని సార్లలో కేవలం ఆరు పులులని మాత్రం చంపగలిగాడు.

గంట రెండు గంటలు మూడు గంటలు అలా గడిచిపోతున్నాయి - రెండు గంట లయింది - అలా చీకటో సిగరెట్లు కాలుస్తూ - అప్పుడే రెండు సార్లు టీ తాగారు అందరూ. పండాకి మహంతికి ఆవలింతలు వస్తున్నాయి. కళ్ళు కూరుకుపోసాగాయి. కూర్చుని కూర్చుని కాళ్ళు పట్టేస్తున్నాయి. ఆకుల సందునించి కొద్ది కొద్దిగా వెన్నెల వెండి బిళ్ళల్లా పడ్తోంది. కింద మేకపోతు తనకేదో జరగబో తూందని పసిగట్టి భయం భయంగా 'మేమే' అని అరుస్తూంది మధ్య మధ్య. తాడు తెంచుకోడానికి గింజుకుంటుంది. మాట్లాడు కోడానికున్నా లేదేమో ఆ నిశబ్ధంలో. అడవిలో ఆకుల గలగలలు - దూరంగా ఎక్కడో కొండమీదనించి దుముకుతున్న నీటిధార శబ్దం. కీచురాళ్ళు నక్కల అరుపులు వుండి వుండి వినిపించే ఏవో పిట్ట కూతలు. ఆ వాతావరణం ముందు అంతా అద్భుతంగా వుందని పించినా రానురాను విసుగు పుట్టసాగింది మిత్రులిద్దరికీ. రమాకాంత్‌కి అలవాటేమో నిశ్శబ్దంగా సిగరెట్ మీద సిగరెట్ కాలుస్తూ ఓపిగ్గా ఎదురు చూస్తూ కూర్చున్నాడు. యాంత్రికంగా కూర్చున్న ఆ రోజు అతని మనసు వేటమీద లేదు. శరీరం ఇక్కడున్నా మనసు ఇందాక చూసిన స్త్రీ మూర్తిని వేటాడుతూంది. వెన్నెలలో కన్పించిన ఆ సౌందర్యం అతని ఏకాగ్రతని చెదర గొడుతూంది. డబ్బిచ్చి కొనుక్కునే పరాయి స్త్రీల పొందు అతనికి కొత్తకాదు. కాని ఈ రోజు ఈ స్త్రీ అలా డబ్బిచ్చి కొనుక్కునేది కాదనుకోగానే ఏదో నిరాశ నిస్పృహ కల్గింది. ఆ నిరాశే అతనిలో మరింత ఆకర్షణ పెంచినట్లయి వద్దనుకున్నా పదేపదే ఆమె రూపమే గుర్తు రాసాగింది.

మూడు గంటలయింది. ఇంక ఈ రోజు ఏ పులీ రాదు కాబోలు అన్న నిరాశ చోటు చేసుకుంది అందరిలో- కూర్చునే కునికి పాట్లు పడుతున్నారు అందరూ. అంతలో హఠాత్తుగా దూరంగా ఎక్కడో పులిగర్జన వినబడింది.

అందరికీ నిద్రమత్తు ఒక్కసారిగా వదిలి పోయింది. ఎటెన్షన్‌లో కూర్చుండి ఆసక్తిగా చూడసాగారు- "ఎక్కడో ఈ

చుట్టుపక్కలకి వచ్చింది' రమాకాంత్ నెమ్మదిగా గుసగుసలాడాడు. పులి అరుపు విని మేక గింజుకుంటూ అరవసాగింది - గాలితోపాటు పులివాసన తగిలింది. తప్ప కుండా మేక అరుపువిని పులి వస్తుందని ఆశగా ఎదురుచూడసాగారు. ఎక్కడ ఏ ఎండుటాకు కదిలినా, పొదకదిలినా చీకట్లో కళ్ళు చీల్చుకుని చూడసాగారు. నాల్గు గంటలయింది. ఎండాకాలం ఏమో మరో అరగంటలోనే తెలివెలుగు రావచ్చు. యింకేం వస్తుంది పులి అనుకుంటూ, అప్పుడే తిరిగిన చల్లగాలికి అందరికి చిన్న మత్తు రావడం ఆరంభించింది. హఠాత్తుగా ఒక్కసారి మేక అరుపుతో పాటు, దబ్బున చప్పుడ వడం ఏమిటి అందరికంటె గన్నర్ ముందు తేరుకుని ఆ దిక్కుగా తుపాకి పేల్చాడు— వెంటనే అందరి చేతుల్లో బ్యాటరీలైట్లు వెలిగాయి. ఒక్క ఉదుటున పులి మేక మీదకి లంఘించి మేకని కరుచు కుని పారిపోయింది. పొదలు కదలడం మాత్రం వెలుగులో అందరికీ కనిపించింది. రమాకాంత్, గార్డు పొదల కదలికవైపు తుపాకులు కాల్చారు. కాని పులికి తగల లేదని అర్థం అయింది, "ప్ ! పారిపో యింది. ఈ పొదలలో ఎక్కడో దాక్కుని

మద్రాసులో ఒక క్రొత్త అగ్ని మాపక యంత్రానికి ప్రారంభో త్సవం చేస్తూ గవర్నరు "షా" గారు "ఇది వృద్ధ కన్యలా ఎల్లప్పుడూ సిద్ధంగా వుండాలి కాని, ఎన్నడూ పిలవబడకుండా ఉండాలి అని నేను ఆశిస్తున్నాను" అన్నారు.

సమయం కనిపెట్టి మీదపడింది ఒక్కసారి ఈ పులులూ మనుష్యులకంటే తెలివిమీరి పోతున్నాయి. బాడ్‌లక్-ఏం చేస్తాం వుయ్ విల్ ట్రై అగైన్ లక్ టుమారో" అన్నాడు రమాకాంత్.

"దిగి లైటుతో చూద్దామా?" అన్నాడు అభిరామ్ ఉత్సాహంగా-

"వద్దు - ఏ పొద చాటునో వుంటే వుండచ్చు. వెలుగు వచ్చేవరకు దిగడం ప్రమాదం" అన్నాడు. అందరికి ఉత్సాహం పోయింది. వెలుగు రావడం కోసం ఎదురు చూస్తూ ఆవలిస్తూ కూర్చున్నారు. మరో అరగంటలో తూరుపు తెల్లబడింది. యింక భయం లేదని అంతా చెట్టుదిగి పొదలవైపు ఓ సారి లైట్లువేసి వెదికారు. బ్యాటరీలైటు వెలుగులో కొంతమేర మేక రక్తం గుర్తులు కనిపించాయి. అప్పుడు వెదికే లాభంలేదని అంతా వెనుదిరిగి డేరా చేరారు. ఐదు గంటలకల్లా బంగళాచేరి వళ్ళెరగకుండా పదిగంటల దాకా నిద్ర పోయారు. నిద్ర పోయేముందు ఒకసారి ఆ డేరావైపు చూశాడు రమాకాంత్.


* * *

పది గంటలకి మెలకువ రాగానే ఒక్క సారిగా తుళ్ళిపడి లేచి కిటికీలోంచి టెంటు వైపు చూశాడు రమాకాంత్.... టెంటు బయట ఆమె - తాడు మీద ఆమె బట్టలు ఆరవేస్తూంది. స్నానంచేసి వేసు కున్న జారుముడి-వంగపండు రంగు మీద ఏవో పెద్ద పూల డిజైను. అదేరంగు జాకెట్టు - రెంటికి మధ్య మెరిసే నడుం చూడగానే రమాకాంత్ గుండెలు ఒక్క క్షణం జోరుగా కొట్టుకున్నాయి - ఆమె యిటు తిరుగుతే బాగుండును అనుకుం టూండగానే ఆమె బట్టలు ఆరవేసి యిటు వైపు తిరిగి ఓసారి బంగళావైపు చూసి లోపలికి వెళ్ళిపోయింది - ఆ చూసిన ఒక్క చూపే రమాకాంత్ మతి పోగొట్ట డానికి సరిపోయింది.

ఆ రోజంతా రమాకాంత్ మనసు మన సులో లేదు. ఆఫీసర్లతో యాంత్రికంగా డిస్కస్ చేశాడు - భోజనం చేసినా మధ్యాహ్నం పడుకున్న అంత మొద్దు నిద్రలోనూ ఆమె గురించే కలలు కన్నాడు. సాయంత్రం అయిం దగ్గిరనించి రమా కాంత్ మూడుసార్లు బాత్‌రూముకి వెళ్ళి వచ్చాడు. రెండుసార్లు వాంతిచేసుకున్నాడు. తల తిరుగుతూందని, దిమ్ముగా వుందని తల పట్టుకు కూర్చున్నాడు. మాత్ర వేసు కున్నా తగ్గక బాధపడ్డాడు. మిత్రు లిద్దరూ గాభరా పడ్డారు. "మరేం పరవాలేదు, రాత్రి నిద్దర చాలలేదు. నిన్న యివాళ డ్రింక్స్, భోజనం హెవీ అయి అరగ లేదు. అంతే" అన్నాడు రమాకాంత్. రాత్రి అయినకొద్దీ అతని తలనొప్పి ఎక్కు వైంది. "ఫ్రెండ్స్ - యివాళ షికారికి రాలేను. మీరు వెళ్ళండి, కంట్రాక్టరు దగ్గి రుండి తీసికెడతాడు, అన్ని ఏర్పాటులు చూశాను" నీరసంగా అన్నాడు.

"నీవు లేకుండా ఏం బాగుంటుంది - నిన్న చూశాంగా, ఇంక వెళ్ళకపోయినా పరవాలేదు" అభిరామ్ అన్నాడు.

"అబ్బెబ్బే అదేమిటి-షికారికోసంవచ్చి



పులిని' కొట్టకుండా వెళ్ళడం ఏమిటి? ఇవాళ మరోచోట మాటు వేయించమని చెప్పాను. పులి తప్పక వస్తుంది. మీరివాళ మిస్ కాకూడదు, నేను లేకపోతేనేం పట్నాయక్ దగ్గిరుండి తీసికెడతాడు" స్నేహితులని వప్పించాడు రమాకాంత్- కంట్రాక్టరుని పిలిచి అప్పగించాడు. 'మీదే పూచి, పులిని కొట్టాలి - అన్ని ఏర్పాటులు చెయ్యండి" అన్నాడు.

"అలాగే సార్, మీకెందుకు మీరు రెస్ట్ తీసుకోండి. అన్నీ నేను చూసుకుంటాను. పులిని కొటి మరీవస్తాం ఉదయం" అన్నాడు వినయంగా.

రాత్రి అంతా వళ్ళాక చల్లగాలికి బయట కుర్చీలో కూర్చుని సిగరెట్ తాగుతున్నాడు రమాకాంత్. కిచెన్‌లో పని పూరయి అందరూ వెళ్ళినట్టున్నారు అంతటా నిశ్శబ్దంగావుంది.

వెన్నెల పిండారబోసి నట్లుంది. గోడ మీదకి పాకించిన సన్నజాజి తీగనిండా నక్షత్రాలలా జాజిపూలు విచ్చుకుని తెల్లగా మెరుస్తున్నాయి. వాటి పరిమళం అతనికి పులకింత నిస్తూంది. వెన్నెల అతని మతి పోగొడ్తూంది. వుండి వుండి అతను టెంట్ వైపు చూస్తున్నాడు. నిన్నటిలాగే ఆమె తెల్లచీరతో బయట యిటు అటు తిరుగుతూంది కాసేపు వినుగొచి నట్లు కుర్చీలో కూర్చుంటుంది. ట్రాన్సిస్టర్ వింటూ కాసేపు కాలక్షేపం చేస్తూంది. పాపం వంటరిగా వుండి విసుగుగా వున్నట్లుంది అనుకున్నాడు. ఆమె వంటరితనం అతనిలో ఏదో ఆలోచనలని రేపుతూంది- వాతావరణం ఏదో ప్రోత్సాహాన్నిస్తుంది. కాని అంతలో ఏదో సందేహం, బెరుకు, భయం, ఏదో వంకన షూటింగ్‌కి వెళ్ళకుండా తప్పించుకుని ఏకాంతం దొరికేట్టు చేసుకున్నాడు కాని- అంతకుమించి ముందుకు వెళ్ళడానికి జంకుగా వుంది, ప్రయత్నించి చూస్తే ఏంపోయింది అని అతని మనసు తొందర పెడ్తూంది, ఇదివరకు ఎంతోమంది స్త్రీలని చూశాడు కాని ఈ నాటి ఈ అనుభూతి అతనికి కొత్త; అందని దానికి అర్రులు చాచడంలో కావాలనుకున్నది పొందడానికి ఈ నిరీక్షణ, ఈ ఆరాటం అతనికి తెలియనివి; అందుకే అతనిలో ఏదో ఆవేశం, ఆరాటం- ఎక్సైట్‌మెంట్‌తో చెమటపడ్తోంది. ఏం చెయ్యాలో, ఎలా ఆరంభించాలో – ఆడదానితో అన్ని అనుభవాలు రుచి చూపిన అతనికే తెలియడంలేదు. ఆమె ఏదన్నా అంటే గొడవ చేసే తన పరువేంగాను?



విష్ణు చక్రభ్రమణం
ఫొటో : ఎం. టి. చారి, వరంగల్

ఆఖరికి ఏమయితే అయింది. కనీసం ఆమెతో మాట్లాడి ఆమెని దగ్గరనించన్నా చూడాలన్న కాంక్షని అదుపులో పెట్టుకోలేకపోయాడు. ఆమె ధోరణి చూసి ముందంజ వెయ్యొచ్చు. లేదంటే వూరికే పరిచయం చేసుకుని మాట్లాడినట్లు మాట్లాడి రావచ్చు- అందులో తప్పేం ఉంది? మనసు కూడదీసుకుని ధైర్యం చిక్కబట్టుకుని తడబడుతున్న అడుగులతో టెంటువైపు వెళ్ళాడు.

* * *

తెల్లవారుఝామునే పులిని చంపిన విజయోత్సాహంతో వేటకి వెళ్ళిన అందరూ వచ్చారు-పులి నిన్నటిలాగే తెలివిగా మాటు వేసిన మేకపోతుని కరుచుకు పారిపోబోయింది. అయితే గన్నర్ చాలా త్వరగా చురుకుగా తుపాకి పేల్చడంతో మొదటి గుండె సరిఅయిన చోట తగిలి పులి మేకపోతుని వదిలి పారిపోబోయింది. రెండో గుండుకి మరి కదలలేక నేలకూలింది. మూడో గుండుకి ప్రాణం వదిలింది. ఎడ డుగుల ఆ పులిని జీపుకి తాళ్ళుకట్టి ఈడు



ఎందుకే మీకంత తొందర
ఫొటో : బి. శ్రీనివాసులురెడ్డి, కొత్తపాళెం


కొచ్చారు. పులి చర్మం, గోళ్ళు, పులి తల అన్నీ మిత్రులిద్దరికి పంపే ఏర్పాటు చేశాడు రమాకాంత్. అంతా పులిని కుతూహలంగా చూడడం అయ్యాక-

ఉదయం బ్రెక్‌ఫాస్ట్ కాంగానే ప్రయాణంపెట్టుకుని జీపు ఎక్కబోతున్నారు అందరు "మిస్టర్ పట్నాయక్ మీ ఆతిధ్యానికి మెనీ థాంక్స్- చాలా బాగా ఏర్పాటు చేశారు అన్నీ" అంటూ థేంక్స్ చెప్పాడు రమాకాంత్ తన అలవాటుకి విరుద్ధంగా. అంటే ఆ ఏర్పాటులు చేయడం వారి విధిలా భావించే అతను ఈ సారి ప్రత్యేకం కంట్రాక్టరుకి కృతజ్ఞతలు చెప్పాడు. పట్నాయక్ ఓ నవ్వు నవ్వి "హీ-హీ... తమ దయ.సార్ నాదో చిన్న మనవి" అన్నాడు నమ్రతగా.

"ఏమిటి చెప్పండి?"

"అదే సార్., ఈ ఏరియా అడవి కొట్టి కలప. టేకు చెట్లు నాటాల్సిన మూడు లక్షల కాంట్రాక్టు .."

'ఐసీ!... టెండర్ కాల్‌ఫర్ చేశాడా.డి. ఎఫ్. వో.?' సాలోచనగా అడిగాడు.




"ఆ చేశారండి – ఎందరు పెటానం!– తమరు కాస్త దయచూసి డి ఎఫ్ వో. గారికి ..' పట్నాయక్ చేతులు నలుపు కుని అన్నాడు.

'ఆ ... సరే – చూస్తాను. డోంట్‌వర్రీ డి. ఎఫ్. ఓ.కి చెప్తాలెండి' అంటూ జీపు ఎక్కాడు రమాకాంత్.

* * *

అంతా వెళ్ళాక తీసజాటుగా మిగిలిన సీసాలు ముందు పెట్టుకుని మిగిలిన చికెన్‌తో చికెన్ ఫ్రై చేయించుకుని పట్నాయక్, ఇద్దరు రేంజర్లు జల్సా చేసుకుంటున్నారు. కాస్త దూరంగా ఆమె కూర్చుని ప్లేటులో వేరుశనగ పలుకులు ఒకోటి తీసి నోట్లో వేసుకుంటూంది. పట్నాయక్‌కి అప్పటికే కైపు తలకెక్కింది. చాలా కులాసాగా ఖుషీగా నవ్వుతూ తుళ్ళిపోతున్నాడు.

"ఏదీ దొర ఏమన్నాడు మళ్ళీ చెప్పు– నిన్న రాత్రి జరిగింది అంతా చెప్పు..." మాట ముద్ద ముద్దగా వుంది. పగలబడి నవ్వుతూ అడిగాడు పట్నాయక్. ఆమె ముసి ముసి నవ్వులు నవ్వింది 'చెప్పాగా' అంది.

"అహా– అలాకాదు సరిగా చెప్పు."

"చెప్పడానికి ఏముంది, పాపం వంటరిగా వున్నారు భయం లేదా అంటూ వంక కల్పించుకుని పలకరించాడు. ఆ అవకాశంకోసం చూస్తున్న నేను కూర్చోపెట్టి కాఫీ యిచాను. అక్కడనించి ప్రశ్నలు మొదలు పెట్టాడు. ఊరికే పదే పదే నీ లాంటి అందగత్తె చదువుకున్నది ఆ ఎదుకి పెళ్ళాం ఎలా అయావు అంటూ బోలెడు సానుభూతి, జాలి కురిపించాడు. నా పేదరికం, నా ఇష్టం లేకుండా రెండో పెళ్ళికి నన్ను కట్టబెట్టడం కన్నీళ్ళతో జాలిగా చెప్పి, నా బాధలు చెప్పుకున్నాను– పాపం కరిగి పోయాడు. ఇద్దరిదీ ఒకటే కథ అని ఓదార్చాడు. తరువాత మరో అడుగు ముందుకు వేసి నీ అందాన్ని అడవి గాచిన వెన్నెల చెయ్యొద్దని, ఇదేం పాపం గాదు.. ఈ ఒక్కరోజు అనుభవం యిచ్చిన జ్ఞాపకాలతో మిగిలిన చేదు జీవితం మింగవేచ్చని, నీ అందం నన్ను పిచ్చివాడిని చేసింది అనుగ్రహించు అంటూ మీద పడ్డాడు. అతను నన్ను వలలో వేసుకోడానికి ఎంత ఆరాటపడుతున్నాడో అతన్ని నేను వలలో వేయడానికి అంత ఆరాటపడుతూనే వున్నాగనక కాస్త బెట్టుచేస్తూ పాపం పుణ్యం అంటూ పతివ్రతలా నటిస్తూ లొంగిపోవడం ఇష్టంలేనట్టు నటిస్తూ కౌగిలిలోకి చేరాను." ఆమె విలాసంగా, గర్వంగా నవ్వుతూ అంది.

"ఇంత బాగా నటించాను మరి నా బహుమతి ఏదీ?" వయ్యారంగా చెయ్యిచాపింది.

"తొందరెందుకు పిల్లా ఇదిగో ఎయ్యి" అన్నాడు నోట్లకట్టలు లెక్కపెట్టి.

"ఇంత కష్టపడ్డా రేటు మించి ఇయ్యడంలేదుకదూ" అంది గునుస్తూ.

"బాగుంది. వందరూపాయలు పడేసే పదిమంది దొరుకుతారు. ఏదో హైక్లాస్ దానివని, కాస్త ఎర్రగా బుర్రగా వున్నావని ఇంగ్లీషు మాట్లాడుతావని ఇంతిచ్చా. ఇంకానా" అన్నాడు పట్నాయక్.

"గురూ మా బలే టోకరా తినిపించావు దొరకి" అన్నాడు ఓ రేంజరు.

"అద్సరే– నీ పెళ్ళాం అని చెప్పక పోతే వచ్చే నష్టం ఏమిటి గురూ!" మరో రేంజరు సందేహం.

"నా పెళ్ళాం కాకపోతే ఆడికి సానుభూతి ఏముంటుంది. ఆడికి తప్పుపని చేసిన పాపభీతి ఏటుంటుంది–ఆడు నాకు ఋణపడినట్టు ఫీలవుతాడా? బజారుదంటే అందరికీ హక్కేకదా–మరోడి పెళ్ళాంమీద వున్న మోజుంటుందా" నవ్వాడు గలగల పట్నాయక్.

"బలే బుర్ర గురూ నీది. ఐడియా అంటే నీదే–వెయ్యి రూపాయలు ఖర్చెట్టి మూడు లక్షల కాంట్రాక్టు కొట్టేశావు. ఎర చూపి పులిని కొట్టేశావు–దొర ఆ పులిని కొట్టేస్తే నీవు ఈ పులినే కొట్టేశావు." రేంజరు భుజం చరిచి గలగలా నవ్వాడు. పట్నాయక్ గర్వంగా మీసం మెలేశాడు. ★

